క్లుప్తంగా

ఘనంగా సూర్య నమస్కారాలు



కార్యక్రమంలో పాల్గొని పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో ఆదివారం సూర్యనమస్కారాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఉదయం తొమ్మిది గంటలకు పండితులు సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సూర్యనమస్కారాల కార్యక్రమం ప్రారంభించారు. వివిధ ఆసనాలలో సూర్యభగవానుడిని అర్చించారు. కార్యక్రమం అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, నాగాభట్ల కృష్ణ, రాపాక రాందాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సామాజిక పింఛన్లను పెంచి లబ్ధిదారులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. సచివాలయ సిబ్బందితో కలసి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ కార్యక్రమాలు

శంఖవరం: కత్తిపూడిలో పెద్దాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో సమీప 8 మండలాలకు చెందిన ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సోమవారం నుంచి ఈ నెల 10 వరకూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ సూరిశెట్టి వెంకటరమణ తెలిపారు. ఉపాధ్యాయులకు బోధన, పరిశీలన అనే అంశాలపై ఈ శిక్షణ ఉంటుందన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా



తమ్మయ్యపేట జాతీయ రహదారిపై బోల్తా పడిన కారు

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. కత్తిపూడి వైపు నుంచి తుని వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి తమ్మయ్యపేట వద్ద రెయింగ్‌ను దాటి బోల్తా పడింది. స్థానికులు కారులో ఉన్నవారిని బయటకు తీశారు. వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తొండంగి పోలీసులు తెలిపారు.

హిందువుల ఐక్యత చాటడానికే శోభాయాత్ర




సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర

సామర్లకోట: హిందువుల ఐక్యతను చాటి చెప్పేందుకే మూడేళ్లుగా నియోజకవర్గ పరిధిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యుడు (రాజమహేంద్రవరం) ఓలేటి సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన హనుమాన్ శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. వందలాది మంది జై హనుమాన్ అనే నినాదాల మధ్య తుమ్మల రామస్వామి ఈ శోభాయాత్రను ప్రారంభించారు. ప్రసన్నాంజనేయుని ఆలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట జంక్షన్, పాత తహసీల్దార్ కార్యాలయం, గాంధీ చౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సెంటర్‌కు రామనామ జపంతో భక్తుల శోభాయాత్ర చేరి అక్కడి నుంచి పెద్దాపురానికి శోభయాత్ర చేరింది. శోభాయాత్ర నిర్వాహకులు కర్రి అప్పలరాజు, పోతుల ప్రభాకర్, ఏడు కొండలు, విజ్జు, గణేష్ తదితరులు భక్తులకు సేవలు అందించారు. సీఐ అంకబాబు ఆధ్వర్యంలో ఎస్సై మూర్తి, ఏఎస్సై రత్నం ఇతర సిబ్బంది బందో బస్తు ఏర్పాట్లు చేశారు.

సంకోతించాల్సిందే..

- గోకవరం వెళ్లేందుకు తటపటాయింపు
- వానరాల దాడితో జనం హడల్
- పరిష్కారం చూపాలని వేడుకోలు



గోకవరంలో ఓ ఇంటి ప్రహరీపై గుంపుగా తిష్టవేసిన వానరాలు

గోకవరం: ఏజెన్సీ ముఖద్వారం.. ఆపై కోతుల మూకల దాడులు.. ఎప్పుడు ఏ పక్క నుంచి వస్తాయో తెలియని పరిస్థితులు.. ఈ పరిణామాల మధ్య గోకవరం మండలంలోకి కొత్తవారు అడుగుపెట్టేందుకు సంకోచిస్తున్నారు. నిత్యం ఇక్కడ అనేక మంది వానరాల దాడిలో గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. మండలంలో కోతులు భయానక వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో గుంపులు, గుంపులుగా గ్రామాల్లోకి చేరి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎదురుపడిన జనంపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. గోకవరం, కొత్తపల్లి, కామరాజుపేట, రంపయర్రంపాలెం, కృష్ణునిపాలెం, తంటికొండ తదితర గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. ముఖ్యంగా గోకవరంలోనే వేల సంఖ్యలో వానర మూకలు ఉన్నాయి. ఇవి బయట తిరుగుతూ ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. వీటిని బెదిరించి బయటకు పంపించాలని ప్రయత్నిస్తున్న యజమానులపై దాడికి దిగుతున్నాయి. ఈ విధంగా గోకవరం మాజీ ఉప సర్పంచ్ పసుపర్తి బుజ్జి గత వారం తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. ఇంట్లోకి చొరబడిన కోతిని బెదిరించే క్రమంలో ఆయన కింద పడగా మణికట్టు విరిగింది. ఈ విధంగా అనేక మంది గాయాల పాలవుతున్నారు. ఇదిలాఉంటే కొత్తవారు మండలంలో అడుగు పెట్టాలంటేనే హడలెత్తిపోతున్నారు.

పొలాలనూ వదలడం లేదు

కోతులు పంట పొలాలనూ వదలడం లేదు. గోకవరం మండలంలో రైతులు ఎక్కువగా పండ్లు, కూరగాయలను సాగు చేస్తుంటారు. పంట చేతికొచ్చే సమయంలో కోతులు గుంపులు, గుంపులుగా తోటలు, పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి. వానర మూకలకు భయపడి అనేక మంది పండ్లు, కూరగాయల సాగుకు దూరమయ్యారు. అదేవిధంగా గతంలో ప్రతి ఇంటి ఆవరణలో పెరటి మొక్కలను పండించేవారు. కోతుల కారణంగా దాదాపు ప్రజలు పెరటి పెంపకాన్ని మానేశారు. గతంలో ఏ ఇంట్లో చూసినా అరటి, జామ, బొప్పాయి వంటి పండ్ల చెట్లు దర్శనమిచ్చేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదంటే కోతులు ఏ విధంగా నష్టపరుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఫలితం శూన్యం

కోతుల సమస్య పరిష్కారానికి అనేక పర్యాయాలు అధికారులు చర్యలు చేపట్టినా అవి శాశ్వత ఫలితాలను ఇవ్వలేదు. గోకవరంలో రెండుసార్లు బోన్లు ఏర్పాటు చేసి వందల సంఖ్యలో కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అయినప్పటికీ యథావిధిగా అవి గ్రామంలోకి చొరబడ్డాయి. దీనివల్ల అధికారులూ ఏమీ చెయ్యలేని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేసి శాశ్వత ప్రాతిపదికన సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లలోకి వస్తున్నాయి



గోకవరంలో కోతులు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను పాడుచేస్తున్నాయి. వాటిని బయటకు పంపించాలని చూస్తే మీద పడి దాడి చేస్తున్నాయి. కోతులను నిర్మూలనకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– పసుమర్తి బుజ్జి, మాజీ ఉప సర్పంచ్, గోకవరం

పండ్ల సాగుకు దూరం



కోతులతో రైతులంతా తీవ్రంగా నష్టపోతున్నాం. తోటల్లో పంట చేతికొచ్చే సమయానికి గుంపులు, గుంపులుగా వచ్చి పండ్ల తోటలను పాడుచేస్తున్నాయి. కోతులకు భయపడి అనేక మంది పండ్ల సాగుకు దూరమయ్యారు. ఇదే పరిస్థితి కొనసాగితే పండ్ల సాగు చాలా కష్టం.

– కొరిపల్లి అప్పులస్వామి, ఆదర్శరైతు, గోకవరం

సేవలు ప్రశంసనీయం



దొంగయ్య దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

కిర్లంపూడి: స్థానిక నీటిపారుదల శాఖలో లస్కర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన చుక్కల దొంగయ్య సేవలు ప్రశంసనీయమని మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు అన్నారు. ఇక్కడి నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద ఆదివారం దొంగయ్య దంపతులను విశ్రాంత ఉద్యోగి పెంటకోట మూర్తి, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ దొంగయ్య 46 ఏళ్లపాటు ఎటువంటి వివాదాలకు తావులేకుండా క్రమశిక్షణతో రైతులకు సేవలందించారని కొనియాడారు. ఐసీఏ అసిస్టెంట్ వై.సత్యనారాయణ, శరకణం సంతోష్, పెంటకోట శ్రీరాములు, బొడ్డేటి గణపతి, మళ్ల నాగు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్‌పై మన్‌కీ బాత్

ఏలేశ్వరం: ప్రధాని మోదీ అధికారం చేపట్టిన తరువాత తొలిసారి చేపట్టిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఏలేశ్వరంలో ఆదివారం ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బాలాజీ చౌక్ సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెలా చివరి ఆదివారం దూరదర్శన్‌లో ప్రసారమవుతున్న ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు వీక్షించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టెం వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు రెడ్డిలోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలను నిలుపుదల చేయాలి



ప్రత్తిపాడులో విలేకరులతో మాట్లాడుతున్న ఐలాజ్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేయనున్న మూడు కొత్త నేర న్యాయ చట్టాలను తక్షణం నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలను బయటకు పంపి, కొత్త చట్టాల అమలుపై ఏకపక్ష తీర్మానం తీసుకుందని ఆరోపించింది. ప్రత్తిపాడులో ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ ఆధ్వర్యంలో ఐలాజ్ ప్రతినిధులు అవసరాల దేవి, పిల్లా రాజు, బందారు నరసింహారావు, బత్తిన సింహాచలం, కందా (నానాజీ), చిట్టుమూరి రాఘవ తదితర న్యాయవాదులు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కొత్త చట్టాల అమలుపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మూడు చట్టాలను అమలు చేస్తే ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ముఖ్యంగా వాక్ స్వాతంత్ర్యం, సమావేశమయ్యే హక్కు, సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, నిరసన ప్రదర్శనలు చేసే హక్కు, ఇంకా ఇతర పౌర స్వేచ్ఛలను, ఆర్టికల్–14, 21లను హరిస్తాయన్నారు. వీటి అమలుపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, దర్యాప్తు సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేశ పౌరులతో సమగ్రంగా చర్చించే అవకాశం కల్పించాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ చట్టాల అమలును నిలుపుదలకు ఐలాజ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర కన్వీనర్ బుగత శివ తదితరులు తెలిపారు.

నేటి నుంచి 'స్టాప్ డయేరియా'

ప్రత్తిపాడు: మండలంలో ఈ నెల 1 నుంచి స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్ ఆర్ పవన్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల ప్రతి ఇంటికి వెళ్లి అతిసారపై అవగాహన కల్పించడం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు హ్యాండ్ వాష్, పరిశుభ్రత, ఆరోగ్య విద్యపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి గ్రామంలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. తాగునీటి వనరులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడం, పంచాయతీ సిబ్బందితో మంచినీటి పథకాలను తరచూ క్లోరినేషన్ చేయించి, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పంచాయతీ, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పవన్‌కుమార్ కోరారు.



షిర్డీనగర్‌లో గాంధీ విగ్రహానికి ఆనుకుని బురదమయంగా మారిన రోడ్డు

బాబోయ్ బురద..

ఏలేశ్వరం: అసలే మట్టి రోడ్డు.. ఆపై వర్షం పడితే ఇక వేరే చెప్పాలా! బురద బురదే. ప్రతి అడుగూ మడుగు లోంచి పడాల్సిందే. ఇది ఏలేశ్వరం షిర్డీ నగర్‌లోని గాంధీజీ విగ్రహానికి ఆనుకుని ఉన్న దారిలో పరిస్థితి. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఈ మట్టి రోడ్డు కాస్తా బురదమయంగా మారింది. కనీసం అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. ఇటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఇక్కడ సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమాజ అవసరాల మేరకు శాశ్వత ప్రాజెక్టులు



నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన డాక్టర్ బాలకృష్ణ

- లయన్స్ క్లబ్ జిల్లా పూర్వపు గవర్నర్ బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ ద్వారా శాశ్వత ప్రాజెక్టులు స్థాపించి సేవలకు సార్థకత చేకూర్చుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా పూర్వపు గవర్నర్, అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్ అవార్డు గ్రహీత డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక లయన్స్ హాల్లో ఆదివారం ఆరు లయన్స్ క్లబ్‌లకు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు క్లబ్ ఆశయాలు వివరించామని, లయన్స్ క్లబ్ శాశ్వత ప్రాజెక్టులైన ఐగ్లాస్ ప్రాజెక్టు, ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, లయన్స్ ఆక్సిజన్ బ్యాంక్, లయన్స్ హాల్ ఆఫ్ సర్వీస్, లయన్స్ ఏకో ఫ్రెండ్లీ సర్వీస్ వంటి వాటి ద్వారా సేవ చేస్తున్నామని, క్లబ్‌లకు అధ్యక్షులుగా ఉన్న వారు వారి కాలంలో వాటి అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. లయన్స్‌క్లబ్ కాకినాడ అధ్యక్షుడిగా ఎంవీఆర్ మోహన్‌కుమార్, సఖి క్లబ్ అధ్యక్షురాలుగా కే.ఉమాదేవి, స్టార్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండీ షర్మిల, మనం క్లబ్ అధ్యక్షులు జే.మధురవాణి, గోల్డ్ క్లబ్‌కు జక్కా రవికుమార్, లయనీస్ క్లబ్‌కు ఎం.అన్నపూర్ణలతో జిల్లా పూర్వపు గవర్నర్ మంజులూరి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్ జిల్లా గవర్నర్ గోలి శ్రీరాములు, వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల భవితే లక్ష్యంగా 'యంగ్ మైండ్స్'



యంగ్‌మైండ్స్ సంస్థ కార్యవర్గ సభ్యులు

కరప: పేద విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారి భవితకు బాటలు వేసే లక్ష్యంతో ఉపాధ్యాయుడు వాకాడ వెంకటరమణ మరి కొందరితో కలిసి యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించారు. కాకినాడ కలెక్టర్ బంగళా వెనుకవీధిలోని అటవీ కార్యాలయం దగ్గరలో దీని నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మండలం నడకుదురు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న వెంకట రమణ ఆ సంస్థ లక్ష్యాలను ఆదివారం విలేకరులకు వివరించారు. సంస్థ కార్యవర్గంలో సెక్రటరీగా దాడిపట్ల బాపిరాజు, ఉపాధ్యక్షుడిగా పడాల ఏడుకొండలు, గౌరవాధ్యక్షుడిగా నరాల కృష్ణకుమార్, కన్వీనర్‌గా బొజ్జా మంగారావు ఉన్నారు.

దారిలోకి తేవాలి



హంసవరం సమీపంలో ప్రమాదకరంగా మారిన ఆర్అండ్‌బీ రోడ్డు

తుని రూరల్: ఏ దారి.. చూసినా గోదారే. అతుకుల బొంతలా, నీటి మడుగులా, రాళ్ల దారిలా కనిపిస్తోంది. కనీసం నడిచి అయినా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. జాతీయ రహదారి ఎర్రకోనేరు నుంచి హంసవరం, దానవాయిపేట మీదుగా కాకినాడ వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. ఈ ఆర్అండ్‌బీ రోడ్డు ఎక్కడికక్కడే గుంతలు పడి ఛిద్రమైంది. అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. తుని వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లాలన్నా, సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న వందలాది హేచరీలు, రొయ్యల చెరువులకు, తొండంగి మండలంలో పలు గ్రామాలకు వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి. అందుకే భారీ, ఇతర వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రహదారి ఎక్కడికక్కడే ధ్వంసం కావడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం వస్తే గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తుంది. అప్పుడప్పుడు మరమ్మతులు చేస్తున్నా పటిష్టత లోపించడంతో మళ్లీ యథాతథంగా మారుతుంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



హంసవరం రైల్వే స్టేషన్ సమీపంలో ఛిద్రమైన రహదారి



నీటి మడుగును తలపిస్తున్న ఎర్రకోనేరు, హంసవరం మార్గం

తీర ప్రాంతంలో కలెక్టర్ పర్యటన



ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతంలో కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం పర్యటించారు. 3న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఉప్పాడ తీర ప్రాంతంలో కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు, నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకోనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల అనంతరం తొలిసారిగా పవన్ నిర్వహించే ఈ పర్యటనకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు కిశోర్, సీతారామారావు, తహసీల్దార్ సుందర్‌రాజు, ఎంపీడీఓ వెంకటనారాయణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనజాతరను విజయవంతం చేయండి



కోటనందూరులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆరుగుల మోషే తదితరులు

కోటనందూరు: ఎమ్మార్పీఎస్ పురిటిగడ్డ ఈదుమూడిలో జూలై 7న జరిగే మాదిగ జనజాతర మహాసభను విజయవంతం చేయాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే పిలుపునిచ్చారు. కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్లీపేట, కోటనందూరు గ్రామాల్లో ఆదివారం మాదిగ తండాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల సంక్షేమం, రిజర్వేషన్ సాధించడమే లక్ష్యంగా నిర్వహించే జనజాతర మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య హాజరవుతారన్నారు. వేలాదిగా మాదిగలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జనజాతరకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోర్త మాణిక్యం, కాపారపు ఏసుబాబు, ముసలిపాము ప్రవీణ్‌కుమార్, తొమ్మండ్ర చిన్న, ములిసిపాము శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల వైపు అడుగులు

- ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం
- దుక్కులు చేసే పనిలో బిజీబిజీ



కిర్లంపూడిలో ట్రాక్టర్‌తో దుక్కు చేస్తున్న రైతు

కిర్లంపూడి: పచ్చని సిరులు కురిపించే ప్రతి రైతు అడుగు పొలాల వైపు పడింది.. వర్షాలు పడుతుండడంతో వ్యవసాయ భూములను దుక్కులు చేసే పనిలో వారు బిజీగా అయ్యారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో వరి సాగుకు ఉపక్రమించారు. ఎరువులు, విత్తనాలను వ్యవసాయ అధికారులు సమకూర్చుతున్నారు. కిర్లంపూడి మండలంలో ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం 13 వేల ఎకరాలు. పలుచోట్ల ఇప్పటికే దుక్కులు చేస్తున్నారు. కొన్నిచోట్ల పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ వేసేందుకు అవసరమయ్యే చర్యలను రైతులు చేపట్టారు. ఈ ఏడాది ఆశించిన మేర సాగు జరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పలు రకాల వరి విత్తనాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు రైతు సేవా కేంద్రాల వద్ద అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఆధార్ కార్డును తీసుకువెళితే విత్తన నమోదుకు అవసరమ్యే ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఎంటీయూ (7029), ఎంటీయూ (1318), ఎంటీయూ (1064) రకాలను 30 కిలోలకు గాను పది శాతం రాయితీ పోగా రూ.1,044 చొప్పున అందిస్తున్నారు.

విత్తనాలు సిద్ధం చేశాం



ఈ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను సిద్ధం చేశాం. పలు రకాల వరి విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చాం. భూమి స్వభావాన్ని బట్టి రైతులు వరి విత్తనం ఎంపిక చేసుకోవాలి. ఎరువులను మోతాదుకు మించకుండా వాడరాదు. పంటల సాగులో మెళకువలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు.

– జోకా అమృతా, మండల వ్యవసాయాధికారి, కిర్లంపూడి

స్థూలకాయంతో కీళ్ల అరుగుదల



ఎముకల సాంద్రత పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కాకినాడ రూరల్: స్థూల కాయంతో కీళ్లు అరిగిపోయే ప్రమాదం ఉందని డాక్టర్ చల్లా భావతేజ పేర్కొన్నారు. మండలంలోని సర్పవరం గ్రామంలో భావనారాయణస్వామి ఆలయం ఎదురుగా కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం గ్రామ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యులు భావతేజ, ఆకుల స్వాతి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యుడు భావతేజ మాట్లాడుతూ శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోవడంతో బరువు పెరుగుతుందన్నారు. శరీరానికి తగినంత వ్యాయామం, జంక్ ఫుడ్ మానుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చన్నారు. బరువు వల్ల కీళ్ల నొప్పులతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సత్తిబాబు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పంపన వెంకట్రావు, రామచంద్రరావు, భాస్కరరావు, బండి శ్రీనివాస్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.